నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 28 డిసెంబర్ 2023 | KAMAREDDY

వామ్మో భారీ చేప

అచ్చంపేట గ్రామానికి చెందిన బెస్త శ్రీనివాస్ రోజూ మాదిరిగానే నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపలను వేటాడుతుండగా వలకు 15కిలోల భారీ చేప చిక్కింది. చేపను ఇంటికి తీసుకురాగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించి, సెల్ఫీలు దిగారు. చేపను రోజూ మాదిరిగానే వ్యాపారికి విక్రయంచనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

–నిజాంసాగర్, డిసెంబర్ 27

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

'స్థానిక' పోరుపై యువత గురి

సర్పంచ్‌గా పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి

రంగం సిద్ధం చేసుకుంటున్న యువ నేతలు

జనవరి 31తో ముగియనున్న జీపీ పాలకవర్గాల గడువు

ఆలోపే ఎన్నికలు నిర్వహించే అవకాశముందని ప్రచారం

రిజర్వేషన్ల ఖరారుపై ఎడతెగని ఉత్కంఠ..

పాతవి కొనసాగిస్తారా.. కొత్తగా ప్రకటిస్తారా?

ఆందోళనలో ఆశావహులు

'స్థానిక' సంస్థల ఎన్నికల సందడి మొదలు కానున్నది. ప్రస్తుత పాలకవర్గాల గడువు జనవరి 31తో ముగియనున్నది. ఆలోపే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. సన్నాహాలు ప్రారంభించాలని, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలని కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఆశావహుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొన్నది. 'పంచాయతీ' బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి చూపుతున్న ది. పోటీ కోసం యువ నాయకత్వం రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఒకవైపు, ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి యువ నాయకులు చొరవ చూపుతున్నారు. మరోవైపు, గ్రామంలోని ముఖ్య నాయకులను కలుస్తూ వారి ఆశీస్సులు పొందేందుకు యత్నిస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

త్వరలోనే ముగియనున్న గడువు..

నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి జిల్లాలో 526 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పాలకవర్గాల గడువు వచ్చే జనవరి 31తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఈసీ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలని ఆదేశించింది. ఓటరు జాబితాల రూపకల్పన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర పనుల్లో యం త్రాంగం నిమగ్నమైంది. అయితే, ఇటీవలే కొలువుదీరిన కొత్త ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు పచ్చజెండా ఊపుతుందా.. లే దా? అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం అనుమతిస్తేనే స్థానిక సంస్థల ఎన్నికలకు అడుగు ముందుకు పడుతుంది. గడువు లోపు ఎలక్షన్లు నిర్వహించలేకపోతే ఇన్‌చార్జీలను పెట్టి పాలనను కొనసాగించే అవకాశమున్నది. లోక్‌సభ ఎన్నికలు ముందున్న తరుణంలో స్థానిక పోరుకు ప్రభుత్వం సై అంటుందా.. లేదా? అన్నది ఆసక్తిగా మారింది.

శాసనసభ ఎన్నికల సమరం ముగిసింది. స్థానిక సంస్థల పోరుకు త్వరలోనే తెర లేవనున్నది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగేందుకు యువత ఉత్సాహం చూపుతున్నది. సర్పంచ్ పీఠాన్ని అధిష్టించేందుకు ఇప్పటినుంచే రంగం చేసుకుంటున్నది. ఈసారి జరిగే జీపీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది యువకులు ఆసక్తిగా ఉన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో సగానికంటే ఎక్కువ స్థానాల్లో యువ నాయకత్వమే బరిలోకి దిగే అవకాశం కనిపిస్తున్నది. వచ్చే జనవరి 31తో ప్రస్తుత పాలకవర్గాల గడువు ముగియనున్నది. ఆలోపు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా.. లేక లోక్‌సభ ఎన్నికల తర్వాత 'స్థానిక' సమరానికి సై అంటుందా? అన్న దానిపై ఆసక్తి నెలకొన్నది. మరోవైపు, రిజర్వేషన్ల ఖరారుపైనా ఆశావహుల్లో అంతులేని ఉత్కంఠ కనిపిస్తున్నది.

– రాజంపేట/పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 27

యువత ఉత్సాహం..

రాజకీయాలంటే పెద్దగా ఆసక్తి చూపని యువత ధోరణిలో ప్రస్తుతం మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. రాజకీయాల్లోకి రావడానికి మక్కువ చూపుతున్నది. అందుకు పంచాయతీ ఎన్నికలను అవకాశంగా మలుచుకోవాలని ఎంతో మంది యువకులు భావిస్తున్నారు. అటు రాజకీయ హోదాను అనుభవించేందుకు, అదే సమయంలో ఇటు ప్రజా సేవ చేయొచ్చన్న ఆలోచనతో చాలా మంది యువ నేతలు పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఊరిలో అధికారం చెలాయించవచ్చనే భావనతో ఎంతో మంది సర్పంచ్ పీఠంపై కన్నేశారు. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులదే హవా స్పష్టంగా కనిపించే అవకాశముంది.

ఆసక్తి.. ఆందోళన

పోటీకి ఆసక్తి చూపుతున్న యువకులు ఇప్పటికే కదనరంగంలోకి దూకేశారు. నిత్యం జనంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ప్రజల్లో గుర్తింపు పొందేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, పల్లెల్లోని సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, ఓటర్లను ప్రభావితం చేసే నేతలను కలుస్తున్నారు. కానీ, ఎక్కడా తమ మనస్సులో మాట బయటపెట్టడం లేదు. రిజర్వేషన్ తమకు అనుకూలిస్తుందో, లేదోనని ఆశావహులను ఆందోళనకు గురిచేస్తుండడమే అందుకు కారణం. రిజర్వేషన్ కలిసొస్తే అప్పుడు నేరుగా రంగంలోకి దిగాలని భావిస్తున్నారు.

ఖరారు కాని రిజర్వేషన్లు..

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరుణంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రిజర్వేషన్లను పదేండ్ల పాటు కొనసాగిస్తూ చట్టం చేసింది. అంటే ఒక గ్రామంలో రెండు పర్యాయాలు నిర్వహించే సర్పంచ్ ఎన్నికలకు ఒకే రిజర్వేషన్ వర్తిస్తుందన్న మాట. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం.. 2019 ఎన్నికల్లో నిర్ణయించిన రిజర్వేషన్లనే ఈసారి కొనసాగించాల్సి ఉంటుంది. అయితే, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం దాన్ని కొనసాగిస్తుందా.. లేదా కొత్తగా రిజర్వేషన్లు ప్రకటిస్తుందా? అన్నది ఆశావాహులను ఆందోళనకు గురి చేస్తున్నది. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించారు. అలాగే, సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు కేటాయిస్తుండడంతో యువ నాయకులు ఎటూ తేల్చులేక పోతున్నారు. పోటీకి ఆసక్తి ఉన్నా తమ మనసులోని మాటను బయట పెట్టడం లేదు. అవకాశమొస్తే మాత్రం బరిలోకి దిగి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన తర్వాతే దరఖాస్తులు స్వీకరించాలి..

కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చాలి

44 లక్షల పింఛన్‌దారులకు రూ.4000 ఇవ్వాలి

నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సిరికొండ/ఇందల్వాయి, డిసెంబర్ 27 : అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన తర్వాతే ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులను స్వీకరించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీలను ప్రతిఒక్కటీ అమలు చేయాలన్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ది లివింగ్ క్రైస్ట్ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అన్ని మతాలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటింగ్‌లో రెండు శాతం మాత్రమే తేడా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.2 వేలు పింఛన్ తీసుకున్న 44 లక్షల మందికి ఎలాంటి దరఖాస్తు తీసుకోకుండా వచ్చే జనవరి 1 నుంచి రూ.4 వేలు ఇవ్వాలన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా రేషన్ కార్డు ఉన్న వారికే ఆరు గ్యారెంటీల సర్వేలో దరఖాస్తులు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మొదట అర్హులందరికీ రేషన్ కార్డు అందించిన తర్వాతే కొత్త పథకాలకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తులో నిరుద్యోగ భృతి కాలం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగ భృతి అందించాలన్నారు. కాంగ్రెస్ చెప్పిన విధంగానే 200 యూనిట్ల కరెంట్ బిల్లు ప్రభుత్వం చెల్లించేలా చూడాలన్నారు. జనవరి నుంచి 200 యూనిట్ల వరకు కరెంట్ బిల్ కట్టవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు మాన్‌సింగ్, సుమ నారెడ్డి, ఎంపీపీ సంగీతా రాజేందర్, మాజీ జడ్పీటీసీ అయిత సుజ ఫిలిప్, మాజీ ఎంపీపీ మంజుల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేశ్, రూరల్ జాగృతి కన్వీనర్ మల్లెల సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితను ఇందల్వాయి మండల నాయకులు, జడ్పీటీసీ గడ్డం సుమనా రవిరెడ్డి, బీఆర్ఎస మండల అధ్యక్షులు చిలువేరి దాసు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. వారి వెంట వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, నాయకులు పాశంకుమార్, ఆరెట్టి రఘు, తేలు విజయ్‌కుమార్, పులి వసంత, రాజునాయక్, సుధాకర్, చిన్న ముత్తెన్న, నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కరోనా కట్టడికి పకడ్బందీ ఏర్పాట్లు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 27 : నిజామాబాద్ జిల్లాలో కరోనా కేసులు రాకుండా ఉండేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ రంగం సిద్ధం చేసింది. మరోవైపు కరోనాను ఎలా అధిగమించాలో జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికను తయారు చేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్ర దవాఖాన 700 పడకల సామర్థ్యం కలిగి ఉంది. అంతేకాకుండా మహారాష్ట్ర దగ్గరగా ఉండడంతో అక్కడి ప్రజలు సైతం జిల్లాకు వచ్చే అవకాశం ఉండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్ర దవాఖానతో పాటు ఆర్మూర్, బోధన్, బాన్సువాడలో దవాఖానల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 43 పీహెచ్‌సీల్లో సైతం కరోనా టెస్టులు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా దవాఖానలో పీపీఈ కిట్లు, ఆక్సిజన్, కరోనా టెస్ట్ కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతుండడంతో జిల్లా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగి కరోనాకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నది. ఇప్పటి వరకు జిల్లాలో కరోనా కేసులు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి అపోహలకు పోకుండా ఇంటివద్ద ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు తెలుపుతున్నారు. కొత్త వేరియం ట్ జేఎన్–1తో ప్రాణహాని లేదని తగు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని అధికారులు తెలిపారు. 43 పీహెచ్‌సీల్లో టెస్టులు చేయించుకోవాలని తెలిపారు.

భయాందోళనకు గురి కావాల్సిన పని లేదు

నిజామాబాద్ జిల్లాలో కరోనా కేసులు ఇప్పటి వరకు రాలేదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి. ప్రభుత్వ దవాఖానలో ఒక్క కరోనా పేషెంట్ అడ్మిట్ కాలేదు. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు.

-ప్రతిమారాజ్, జిల్లా కేంద్ర దవాఖాన సూపరింటెండెంట్

అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లా వ్యాప్తంగా కరోనాను అడ్డుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అన్ని పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. కరోనాను జిల్లా యంత్రాగం పకడ్బందీగా నియంత్రిస్తుంది. వైద్యా అధికారులు అందుబాటులో ఉన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో కరోనా టెస్టులు చేస్తారు.

-సుదర్శనం, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

నేటి నుంచి 'ప్రజాపాలన'

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 27: ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తు స్వీకరణ కోసం నేటి నుంచి ప్రజాపాలన ప్రారంభం కానున్నది. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించారు. గ్రామాలు, వార్డుల వారీగా సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రజాపాలన నోడల్ అధికారిగా క్రిస్టినా జడ్ చోంగ్తూ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం అమలు తీరును జిల్లా స్థాయిలో పరిశీలించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారిగా క్రిస్టినా జడ్ చోంగ్తును నియమించారు.

భర్తను చంపిన భార్య

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 27: కుటుంబ కలహాలతో కట్టుకున్న భర్తను.. కొడుకు సహాయంతో భార్య అతి దారుణంగా హత్య చేసిన ఘటన బాన్సువాడ మండలంలోని మొగులాన్‌పల్లిలో చోటు చేసుకున్నది. సీఐ మహేందర్ రెడ్డి బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగులాన్‌పల్లి గ్రామానికి చెందిన అల్లే రామాగౌడ్(58), సరోజ భార్యాభర్తలు. వీరు పదేండ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. భార్యా భర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండడంతో సరోజ నాలుగేండ్ల క్రితం కొడుకు అంజాగౌడ్‌తో కలిసి గ్రామానికి వచ్చేసింది. భర్త రామాగౌడ్ తరచూ ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ నెల 24న కూడా భార్య సరోజ వద్దకు వచ్చాడు. మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రామాగౌడ్‌ను హత్య చేసేందుకు పథకం పన్నారు. అర్ధరాత్రి కొడుకు అంజాగౌడ్‌తో కలిసి బండరాయితో కొట్టి రామాగౌడ్‌ను హత్య చేశారు. అనంతరం కొడుకు తండ్రి శవాన్ని గ్రామానికి చెందిన సాయిబాబాతో కలిసి మోటర్ సైకిల్‌పై తీసుకెళ్లి గ్రామ సమీపంలో బుడ్మి చెరువులో పడేశాడు. 26న రామాగౌడ్ కనిపించడం లేదని భార్య, కొడుకు కలిసి రామాగౌడ్ సోదరుడైన శంకర్‌గౌడ్‌కు సమాచారం అందించారు. ఈ విషయమై శంకర్‌గౌడ్ గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లగా కొడుకుతో కలిసి సరోజనే రామాగౌడ్‌ను హత్య చేసినట్లు గ్రామస్తులు తెలిపారని అన్నారు. శంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. నిందితులైన సరోజ, అంజాగౌడ్, వారికి సహకరించిన సాయిబాబాను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు.

కుల బహిష్కరణ కేసులో నలుగురి రిమాండ్

నిజామాబాద్ క్రైం/భీమ్‌గల్, డిసెంబర్ 27: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగాపూర్ చౌత్ గ్రామంలో మున్నూరు కాపు కులానికి చెందిన ఓ కుటుంబాన్ని కులబహిష్కరణ చేసిన నలుగురిపై ఈనెల 26న కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అదనపు డీసీపీ జయరామ్ వెల్లడించారు. రెండు నెలల క్రితం ఓ స్థలం విషయంలో బహిష్కరణ విధించారని, అందుకు బాధ్యులైన జంగం శేవ్వాయి రాజేశ్వర్, జంగం శేవ్వాయి నర్సయ్య, చెలిమెల పెద్దబాలయ్య, పుప్పాల పెద్ద నడిపి పోశెట్టిలను ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్లు బాగాయే.. బస్సులు కరువాయే..

రెంజల్ మండలంలో పల్లెలకు ఆర్టీసీ బస్సులు రద్దు

గ్రామీణ మహిళలకు అందని 'మహాలక్ష్మి'

ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థినులు

లబ్ధిపొందని మహిళలు.. అదనంగా ఆర్థికభారం

పదేండ్ల క్రితం వరకు రోడ్డు సౌకర్యం సరిగా లేదనే సాకుతో ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపేవారు కాదు. కానీ, స్వరాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ హయాంలో క్రమంగా ప్రతి మారుమూల పల్లెకూ బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చారు. ఇందులో భాగంగా 2022లో రెంజల్ మండలంలోని కళ్యాపూర్– బాగేపల్లి రోడ్డును గత ప్రభుత్వం రూ. 92.50 లక్షల నిధులతో నిర్మించింది. నేడు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం పల్లెవాసుల దరిచేరడం లేదు.

–రెంజల్, డిసెంబర్ 27

రెంజల్ మండలం బాగేపల్లి, కందకుర్తి రూట్లలో ఆర్టీసీ సేవలు అందడం లేదు. బాగేపల్లి, కునేపల్లి, కళ్యాపూర్, కిసాన్‌తండా తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆయా పల్లెవాసులతోపాటు నిత్యం చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులకు కూడా ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో ఈ రూట్లో నిజామాబాద్–2 డిపో బస్సులు నడిపేవారు. కానీ కరోనా కారణంగా మూడేండ్ల కింద నిలిపివేసిన సేవలను నేటికీ పునరుద్ధరించలేదు. నిజామాబాద్ నుంచి దూపల్లి మీదుగా కందకుర్తికి కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు అందుబాటులో ఉంటున్నది. పాఠశాలలకు సెలవులు ఉన్న రోజుల్లో ఒక్క బస్సు కూడా నడపడం లేదు. ఆయా రూట్లలో విద్యార్థులతోపాటు ప్రయాణికులు నిత్యం వేల సంఖ్యలో వివిధ పనుల కోసం బోధన్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

విద్యార్థినులు, మహిళలకు తప్పని ఆర్థికభారం..

బాగేపల్లి, కళ్యాపూర్, కునేపల్లి, కిసాన్ తండా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో పేద మహిళలు, విద్యార్థినులకు ఆర్థిక భారం తప్పడంలేదు. కూలి పనులకు కోసం పట్టణాలకు వెళ్లే మహిళలు, చదువుకునేందుకు కళాశాలలు, పాఠశాలలకు వెళ్తున్న బాలికలు ఆటోలో ప్రయాణం కోసం ప్రతినెలా కనీసం వెయ్యి రూపాయలు చెల్లించాల్సి వస్తున్నది. మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుండగా, రెంజల్ మండలవాసులు నేటికీ డబ్బులు చెల్లించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మా గ్రామాలేమైనా మహారాష్ట్ర పరిధిలో ఉన్నాయా అంటూ మండిపడుతున్నారు. ఆర్టీసీ బస్సులను ఎందుకు నడిపించడంలేదని ప్రశ్నిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

బస్సు అద్దాలు ధ్వంసం

నందిపేట్, డిసెంబర్ 27: నిజామాబాద్ నుంచి నందిపేట్ వస్తున్న నిజామాబాద్–1వ డిపో బస్సు డ్రైవర్ నాగూరి తుకారాంపై దాడి చేయడంతోపాటు బస్సు కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని ఆర్టీసీ అధికారులు, బాధిత డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ బస్టాండ్‌లో స్టేజీపై ఉన్న సమయంలో నందిపేట్‌కు చెందిన ఓ మహిళ సీటు కోసం బయటి నుంచి బ్యాగ్‌ను బస్సులోకి విసరగా కిటికీ అద్దం ధ్వంసమైంది. దీనికి నష్టపరిహారం చెల్లించాలని బస్సు డ్రైవర్ ఆమెను అడిగాడు. నందిపేట్ వెళ్లిన తర్వాత అక్కడ డబ్బులు ఇస్తానని చెప్పిన ఆ మహిళ, తన కుటుంబీకులకు ఫోన్ చేయగా సుమారు 15మంది బస్సు నందిపేట్ బస్టాండ్‌కు చేరుకున్నారు. డ్రైవర్ కాలర్ పట్టుకొని దాడి చేశారు. రాళ్లతో మళ్లీ బస్సుపై దాడి చేయగా మరో రెండు అద్దాలు పగిలిపోయాయి. మొత్తం మూడు అద్దాలు పగిలిపోయాయని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కునేపల్లిని మహారాష్ట్రలో కలిపిండ్రా?

బాగేపల్లి, కునేపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సులను ఎందుకు నడపడంలేదు. మా పల్లెలను ఆర్టీసీ అధికారులు మహారాష్ట్రలో కలిపిండ్రా? అందరు బస్సుల్లో ఫ్రీగా పోతున్న రు. మేమేమో బస్సులేక ఆటోలకు పైసలిచ్చి పోవాల్నా? మేము ఓటెయ్యలేదా.. మహాలక్ష్మీ పథకం మాకు వర్తించదా?

-పెరమండ్ల చంద్ర, కునేపల్లి గ్రామం

నెలకు రూ. వెయ్యి ఖర్చవుతున్నది..

నేను రెంజల్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్నా. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. ప్రతిరోజూ ఆటోలో వెళ్లాల్సిందే. ప్రతినెలా రూ. వెయ్యిదాకా ఆటోకు చెల్లిస్తాం. ఈ ఖర్చు తల్లిదండ్రులకు భారమే.

-ఎస్. అశ్రిత, 9వతరగతి, ఆదర్శ పాఠశాల విద్యార్థిని, బాగేపల్లి.

4కిలోమీటర్లు నడుస్తున్నాం..

రోడ్లు బాగున్నా.. బస్సు సౌకర్యం లేక 4కిలోమీటర్లు కాలినడకనే మాకు దిక్కు. బాగేపల్లి నుంచి కళ్యాపూర్ రోడ్డు వరకు నడిచి వెళ్లి అక్కడి నుంచి రెట్టింపు చార్జీలు చెల్లించి నవీపేట్, సాటాపూర్ వైపు ఆటోల్లో ప్రయాణిస్తున్నం.

- సిరిగిరి అనిత, జీడీ కాల్మికురాలు, బాగేపల్లి

బస్సు సౌకర్యం కల్పించాలి..

మా ఊరికి బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నాం. అన్ని ఊర్లల్ల ఆడోళ్లు ఫ్రీల బస్సు ఎక్కుతుండ్రు. మాకేమో బస్సే రాదాయే. చానా ఇబ్బంది అవుతుంది. పొద్దున, సాయంత్రం బాగేపల్లి వరకు బస్సు వేస్తే ఆడోళ్లు, ఉద్యోగులు, విద్యార్థులకు మంచి సొలత్ అయితది.

- పిట్ల పుష్ప, వ్యవసాయ కూలి, బాగేపల్లి